పత్తి పంటకు నీటి తిప్పలు

- నీరందక ఎండుతున్న పంట
- 500 ఎకరాలకు అందని సాగునీరు
- సోమశిల ప్రాజెక్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు



పూత దశలో వాడుముఖం పట్టిన పత్తి పంట

ఆత్మకూరు: వేలాది రూపాయలు వెచ్చించి సాగు చేసిన పత్తి పంటకు సోమశిల ప్రాజెక్ట్ అధికారుల ఉదాసీనత కారణంగా సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమశిల జలాశయంలో 60 టీఎంసీల నీరు ఉన్నా దక్షిణ కాలువకు, దాని చీలుకాలువ 26ఎల్ కాలువకు నీటి సరఫరా సక్రమంగా లేదని రైతులు ఆరోపిస్తున్నారు. చేజర్ల, పొదలకూరు మండలాల పరిధిలోని భూముల తోపాటు సంగం మండలంలోని ఎగువ భూములకు దక్షిణ కాలువ నీరు సరఫరా అవుతుంది. ఈ క్రమంలో చేజర్ల మండలంలోని రెడ్డివారికండ్రిక, యర్రబల్లి, బత్తలపల్లి, మాముడూరు గ్రామాల్లో సుమారు 500 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రైతులు పత్తి పంట సాగు చేశారు. ఏపుగా పెరిగిన పత్తి పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. గత 15 రోజులుగా దక్షిణ కాలువకు పూర్తిస్థాయిలో నీరు రాకపోవడం, వచ్చిన నీరు సైతం పొదలకూరు మండలంలోని కొన్ని గ్రామాల పరిధిలో కాలువలకు ప్రవహిస్తుండడంతో దక్షిణ కాలువ చీలుకాలువైన 26ఎల్ కాలువకు సరఫరా కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ ఏఈ సూచన మేరకు రైతులే సొంతంగా 350 ఇసుక బస్తాలను సిద్ధం చేసి 26ఎల్ కాలువకు సరఫరా అయ్యేలా ప్రయత్నాలు చేసినా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. 26ఎల్ కాలువ నుంచి రెడ్డివారికండ్రిక గ్రామానికి 11ఆర్ కాలువ ద్వారా సాగునీరు సరఫరా కావాల్సి ఉండగా నీరు సక్రమంగా అందక కాలువ సైతం ఎండిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టి పత్తి పంట సాగు చేస్తుండగా సోమశిల ప్రాజెక్ట్ అధికారుల ఉదాసీనత కారణంగా సాగునీరు అందక పూత దశలో ఉన్న పంట వాడుముఖం పట్టిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జలాశయం అధికారులు పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రెండు వారాలుగా నీరు అందకపోవడంతో ఎండిన 11ఆర్ కాలువ

రెండు రోజుల్లో నీరు కట్టకపోతే ఇబ్బందే



మూడు నెలల క్రితం సాగు చేసిన పత్తి పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఈ దశలో పత్తి పంటకు పుష్కలంగా నీరు కట్టాలి. అయితే గత 15 రోజులుగా మా పొలాలకు సాగునీరు సరఫరా కావడం లేదు. బస్తాలు సిద్ధం చేసినా నీరు ఎక్కడం లేదు. మరో రెండు రోజుల్లో నీరు కట్టకపోతే పైరు ఎండిపోతుంది.

– ఎల్.రామిరెడ్డి, రెడ్డివారికండ్రిక

అధికారులు వెంటనే స్పందించాలి



పత్తి ధర బాగుండడంతో ఈ ఏడాది ఆ పంటను సాగు చేశాం. రెండు వారాలుగా పత్తి పంటకు సాగునీరు అందకపోవడంతో వాడుముఖం పట్టింది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి రైతుల ఇబ్బందులను గమనించి సాగునీరు అందించాలి.

– మస్తాన్‌రెడ్డి, రెడ్డివారికండ్రిక

నీరు విడుదల చేస్తున్నాం

రెడ్డివారికండ్రిక తదితర గ్రామాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదన్న విషయం మా దృష్టికి వచ్చింది. కొన్ని సాంకేతిక సమస్యలతో దక్షిణ కాలువలో పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయలేదు. దీంతో 26ఎల్ చీలుకాలువకు తగినంతగా నీరు అందడం లేదు. బస్తాలు అడ్డుగా పెట్టి రెండు రోజుల పాటు పూర్తిగా బాధిత గ్రామాలకు నీరు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– సుధీర్, డీఈ, సోమశిల ప్రాజెక్ట్ (పొదలకూరు సెక్షార్)

క్లుప్తంగా

గుహమల్లేశ్వరునికి ఏకాంతసేవ



వింజమూరు: మండలంలోని నల్లగొండ్లలో వెలసిన గుహమల్లేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల 16 రోజుల పండగను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శివపార్వతులను ప్రత్యేక పల్లకిలో ఉంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముత్తయిదువులు పాటలు పాడారు. అనంతరం శాస్త్రోక్తంగా ఏకాంతసేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అన్నపరెడ్డి మోహన్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

- సీనియర్ సివిల్ జడ్జి రాజేష్



మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజేష్

ఆత్మకూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అవకాశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.రాజేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఎస్ఎస్‌వీ జూనియర్ కళాశాలలో సోమవారం మండల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్ మాట్లాడుతూ విద్య, వైద్యం, క్రీడలు, రాజకీయ రంగాల్లో మహిళలు పురోగతి సాధిస్తున్నారని, అదే క్రమంలో దేశ అభివృద్ధికి ఉపయోగపడే పారిశ్రామిక రంగంలోనూ వారు ముందుకుసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్సై ఎం.శివశంకర్‌రావు, ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్, న్యాయవాది తిరుపతమ్మ, పెంచలనరసయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చేజర్ల: మండలంలోని కాకివాయి గ్రామంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగా నాగిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని చుక్కల భూములు, అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బీమా నగదు అందజేత

అల్లూరు: మండలంలోని ఇస్కపల్లి పంచాయతీకి చెందిన షేక్ షకీల(55) ఇటీవల మృతిచెందగా వైఎస్సార్ బీమా పథకం ద్వారా ఆ కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేల నగదును సర్పంచ్ పాటి రంజిత్‌కుమార్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది భాగ్యలక్ష్మి, వార్డు సభ్యురాలు షాబుద్దీన్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఇంటి, కొళాయి, వాణిజ్య, సముదాయాల పన్నులు సకాలంలో చెల్లించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆత్మకూరులో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నులు సక్రమంగా చెల్లించని వారి నుంచి ఆస్తులు జప్తు చేసేందుకు మున్సిపల్ చట్టంలో అనుమతి ఉందని తెలిపారు. అలాగే కొళాయి పన్నులు చెల్లించని వారి కనెక్షన్లు తొలగిస్తామన్నారు. పన్నులు చెల్లించాల్సిన వారు ఈ నెల 20వ తేదీ లోపు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సెలవు దినాల్లో సైతం చెల్లించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఖాసీం, బిల్ కలెక్టర్ గోపి, సిబ్బంది శ్రీనివాస్, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

పదికి పది సాధించాలి

అనుమసముద్రంపేట: త్వరలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పదికి పది పాయింట్లు సాధించేలా విద్యార్థినులు బాగా చదవాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. సోమవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సరస్వతిపూజ నిర్వహించారు. ప్రిన్సిపల్ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి ఆత్మకూరు బీఎస్ఆర్ వైద్యశాలకు చెందిన డాక్టర్ బి.షకీల మైక్‌సెట్‌ను వితరణగా అందజేశారు. కొద్ది నెలల క్రితం ఆమె పాఠశాలకు వెళ్లినప్పుడు విద్యార్థులు, ఉపాధ్యాయులు మైక్ కావాలని అడగడంతో ఆమె సోమవారం విశ్రాంత ఉపాధ్యాయుడు సాధిక్ హుస్సేన్ ద్వారా మైక్‌సెట్‌ను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి, ప్రిన్సిపల్ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 4, 5 తేదీల్లో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు సోమవారం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కాకర్ల సురేష్ నగదు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల నుంచి 38 జట్లు పాల్గొనగా నెల్లూరు జట్టు మొదటి బహుమతి సాధించి రూ.25,116 అందుకుంది. ద్వితీయ బహుమతిగా ఉదయగిరి జట్టుకు రూ.15,116 నగదును అందజేశారు. అలాగే విజేతలకు జ్ఞాపికలను అందజేశారు.

సుపరిపాలనపై పారిశ్రామికవేత్తల నమ్మకం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ దేశంలోనే దిగ్గజ పారిశ్రామికవేత్తల నమ్మకాన్ని సంపాదించుకున్నారని, అందుకే రాష్ట్రంలో రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. కావలిలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంపై కక్షతో ఉన్న చంద్రబాబు, టీడీపీ అనుకూల మీడియా విశాఖపట్టణంలో జరిగిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'పై విషం చిమ్మారని తెలిపారు. ఏపీలో పరిశ్రమలు స్థాపించేందుకు ఉన్న అపారమైన అవకాశాలను పారిశ్రామికవేత్తలకు తెలియజేస్తూ 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'ను ముఖ్యమంత్రి విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. ఈ సమ్మిట్‌లో పారిశ్రామికవేత్తలు చేసుకున్న ఒప్పందాల వల్ల రాష్ట్రంలోని 6.09 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూముల మంజూరు, ప్రభుత్వ అనుమతులు పొందడానికి, త్వరితగతిన పరిశ్రమల నిర్మాణ పనులు ప్రారంభం కావడానికి తానే అందుబాటులో ఉంటానని సీఎం పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చి తన త్రికరణ శుద్ధిని చాటుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలతో పాటు దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలు సైతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను అభినందిస్తూ ఆశీస్సులు అందజేస్తుంటే, టీడీపీ నాయకులు మాత్రం అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేక్ కట్ చేసి సంబరాలు

'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్' విజయవంతం అయిన సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, షేక్ షాహుల్ హమీద్, తిరువీధి ప్రసాద్, అమరా వేగదగిరి సుబ్బరాయుడుగుప్తా, పుల్లా శ్రీనివాసులురెడ్డి, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

వింజమూరు: పింఛన్‌దారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర జేఏసీతో కలిసి పనిచేస్తామని పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల రమణయ్య తెలిపారు. స్థానిక గాయత్రినగర్‌లోని పెన్షన్‌దారుల భవనంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం 75 ఏళ్లు నిండిన పింఛన్‌దారులను సన్మానించారు. జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్లు శ్రీకాంత్, ఎస్‌వీఎస్ మూర్తి, జె.హజరత్తయ్య, విశ్రాంత డీఎంహెచ్ఓ మాశిలామణి తదితరులు పాల్గొన్నారు. నూతన మండలశాఖను ఎన్నుకున్నారు.

ఉత్తరక్రియలకు ప్రముఖుల హాజరు



సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

మర్రిపాడు: వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ మహిళా నేత ఎస్.శాంతికుమారి తల్లి వెంకటరత్నమ్మ ఇటీవల మృతిచెందడంతో సోమవారం మండలంలోని కంపసముద్రం గ్రామంలో పెద్దకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటరత్నమ్మ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్, ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డితోపాటు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేకపాటికి పరామర్శ

మర్రిపాడు: మర్రిపాడులోని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యేని కలిసి పరామర్శించారు. ఇటీవల ఆయన గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న క్రమంలో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నిధులు మంజూరు చేయండి



ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన నాయకులు

ఉదయగిరి: నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు గ్రామాలకు సాగునీందిస్తున్న నక్కలగండి రిజర్వాయరును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి సోమవారం కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ బి.చంద్రశేఖర్ వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మర్రిపాడులోని ఎమ్మెల్యే నివాసంలో నాయకులు ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. ఉత్తర, దక్షిణ కాలువలు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయని, త్వరగా మరమ్మతులు చేయించి రైతులకు సాగునీరందించాలని కోరారు. ఎమ్మెల్యే మేకపాటి స్పందిస్తూ ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఆయన వెంట నూతంగి వెంకటనరసింహరావు, తిరివీధి హరికృష్ణ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

వింజమూరు: మండలంలోని గుండెమడకలలో అంకాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం విగ్రహాలను హోమశాలకు తరలించారు. గణపతిపూజ, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఉదయగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంపీడీఓ పి.ఐజాక్‌ప్రవీణ్ సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులతోపాటు భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు భోజన పథకం నిర్వాహకులు తెలిపారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఆత్మకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సోమశిల: చిలకలమర్రిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



ఉదయగిరి: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

ఆత్మకూరు: తూర్పురాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరఫున ఆయా రాజకీయ పార్టీల నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నెల 13వ తేదీ జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఆత్మకూరులో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ అధ్యక్షుడు ఎన్.ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 7వ వార్డు పరిధిలో కౌన్సిలర్ నౌషాద్ బేగం, సయ్యద్ జమీర్‌బాషా ఆధ్వర్యంలో ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కె.వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు తిరుపతమ్మ, మహబూబ్‌బాషా, కొండా చిన్నవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, బ్రహ్మానందచార్యులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, కె.సుధాకర్, గుండాల రామకృష్ణారెడ్డి, చింతలపల్లి భరత్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న ప్రచారాలు

సోమశిల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తూర్పురాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీ నేతల ప్రచారాలు జోరందుకున్నాయి. సోమవారం మండల కేంద్రం అనంతసాగరం, మండలంలోని చిలకలమర్రిలో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపు కోసం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్ రెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు తదితరులు ప్రచారం నిర్వహించారు. అలాగే అనంతసాగరంలో బీజేపీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, సోమశిలలో టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌లకు మద్దతుగా ఆయా పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించారు.

ఆశీర్వదించండి

జలదంకి: వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలను ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు మాలకొండారెడ్డి కోరారు. మండలంలోని చినక్రాకలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రావి ప్రసాద్‌నాయుడు, గుర్రం ధనుష్‌నాయుడు, పులి భాస్కర్‌రెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించండి

దుత్తలూరు: వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం దుత్తలూరులోని బీసీ కాలనీలో పేర్నాటికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కంభం మురళీమోహన్‌రెడ్డి, శ్రీహరినాయుడు, వెంకటేశ్వర్లు, వెంగయ్య, షరీఫ్, బాబి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

గుండెమడకల, శంఖవరంలలో..

వింజమూరు: వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం మండలంలోని గుండెమడకల, శంఖవరం సచివాలయాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, నాయకులు అంకినపల్లి నరసింహారెడ్డి, లెక్కల సుధాకర్‌రెడ్డి, దాట్ల విజయభాస్కర్‌రెడ్డి, బలరామిరెడ్డి, విజయకృష్ణారెడ్డి, పి.వెంకటేశ్వర్లు, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేతల ప్రచారం

ఉదయగిరి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఓటర్లను కలిసి వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ముర్తుజాహుస్సేన్, గడియాల్చి ఎస్థాని, ఉప్పుటూరి శ్రీను, గొల్లపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చిత్తలూరులో..

చేజర్ల: వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు సోమవారం మండలంలోని చిత్తలూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కోఆర్డినేటర్ పూనూరు బాలంగాధర్‌రెడ్డి, మోడేపల్లి పెంచలనాయుడు, గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

మర్రిపాడు: వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, నాయకుడు జి.శ్రీనివాసులునాయుడు కోరారు. మండలంలోని డీసీపల్లి, నందవరం, భీమవరం గ్రామాల్లో వారు సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అండగా నిలవాలి

ఆత్మకూరురూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పట్టభద్రులు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మండలంలోని బోయలచిరివెళ్ల, గొల్లపల్లి, నబ్బీనగరం తదితర గ్రామాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బోయలచిరివెళ్ల సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కరేటి హజరత్‌రెడ్డి, రావూరు శ్రీనివాసులురెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.